

సోమశిలలో 20.011 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 20.011 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.63,950
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,743
3శాతం జీఎస్టీతో	రూ.5,915
నవర (8గ్రా)	రూ.47,320

గరిష్టం/కనిష్టం
32.6 /23.4

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 61 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. మంగళవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ తూమాటి



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ తూమాటి

కందుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కందుకూరు నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సీఎంతో చర్చించినట్లు తూమాటి తెలిపారు.

163 మంది హెచ్‌ఎంలకు షోకాజు నోటీసులు

నెల్లూరు(టౌన్): విధుల్లో అలసత్వం వహిస్తున్నారన్న కారణంతో జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని 163 మంది హెడ్‌మాస్టర్లకు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సోమవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతకు సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయని కారణంగా 19 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి గత కొంతకాలంగా ఫొటోలు అప్‌లోడ్ చేయలేదన్న కారణంతో 69 మంది హెచ్‌ఎంలకు, మధ్యాహ్న భోజన పథకానికి విద్యార్థుల హాజరు శాతం తక్కువగా నమోదవుతున్నా పట్టించుకోవడం లేదన్న కారణంతో 75 మంది హెచ్‌ఎంలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న హెచ్‌ఎంలు లిఖితపూర్వకంగా వివరణ పంపాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

బర్డ్‌ఫ్లూతో అప్రమత్తం

జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై అధికారులు అప్రమత్తమయ్యారు. కోళ్ల ద్వారా ప్రజలకు ఎక్కడా ఎలాంటి అనారోగ్యాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బర్డ్‌ఫ్లూ భయంతో నెల్లూరు నగరంలోపాటు సమీప ప్రాంతాల్లోని చికెన్ దుకాణాలను మూయించారు. ప్రధానంగా బర్డ్‌ఫ్లూ సోకిన ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

చికెన్ దుకాణాల మూసివేత
- ప్రత్యామ్నాయంగా చేపలు, మటన్‌కు పెరిగిన గిరాకీ
- నెల్లూరు, సమీప ప్రాంతాల్లో వెయ్యికిపైగా చికెన్ షాపులు

నెల్లూరు(సెంట్రల్): బర్డ్‌ఫ్లూ జిల్లాలో కలకలం సృష్టించింది. జిల్లాలోని పొదలకూరు మండలం చాటగొట్ల గ్రామం, కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ గ్రామంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ సోకి పెద్ద సంఖ్యలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తమై ఈ బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నెల్లూరు నగరంతోపాటు సమీప ప్రాంతాల్లో దాదాపు 1,000కి పైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిత్యం 25 వేల కేజీల చికెన్ విక్రయాలు, ఆదివారం రోజు మాత్రం 60 వేల కేజీల చికెన్‌ను విక్రయిస్తుంటారు. కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకడంతో గత మూడు రోజులుగా చికెన్ దుకాణాలు తెరుచుకోక విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రజలు కూడా బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ దుకాణాల వైపు కన్నెత్తి చూడడం లేదు.

చేపల మార్కెట్లు కిటకిట

గత నాలుగు రోజులుగా చికెన్ దుకాణాలు మూసివేయడంతో నెల్లూరులోని చేపల విక్రయ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. నెల్లూరుతో పాటు సమీప ప్రాంతాల్లో సాధారణ రోజుల్లో చేపల విక్రయాలు 4 వేల కేజీలు ఉండగా, ఆదివారం మాత్రం 20 వేల కేజీల వరకు విక్రయిస్తుంటారు. కాగా చికెన్ దుకాణాల మూసివేతతో 30 వేల కేజీలకు పైగా చేపలను విక్రయించారు. అలాగే కొన్నిచోట్ల మటన్ రేట్లను కూడా పెంచేశారని కొనుగోలుదారులు చెబుతున్నారు. కాగా అధిక రేట్లు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు వ్యాపారులను హెచ్చరిస్తున్నారు.

ప్రత్యేక బృందాల పరిశీలన

జిల్లాలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై పరిస్థితిని పరిశీలించి తగు చర్యలు తీసుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయి. ప్రధానంగా పశుసంవర్ధకశాఖకు సంబంధించి విజయవాడ నుంచి వచ్చిన ఇద్దరు ఉన్నతాధికారుల బృందం బర్డ్‌ఫ్లూను గుర్తించిన ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. అలాగే నెల్లూరులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతేకాకుండా ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించింది.



నెల్లూరులో మూతపడిన చికెన్ దుకాణం


నేటి నుంచి చికెన్ విక్రయాలు

కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిన, సమీప ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా చికెన్ దుకాణాలను మూసివేయగా, మంగళవారం నుంచి నెల్లూరులో చికెన్ విక్రయాలు చేసుకునేలా ఆదేశాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. అయితే చికెన్ దుకాణాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఏదిఏమైనా అధికార యంత్రాంగం సమన్వయంతో ఎక్కడా బర్డ్‌ఫ్లూ వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిన ప్రాంతంలో పరిశీలిస్తున్న విజయవాడ అధికారులు

పారిశుద్ధ్యం మెరుగుపర్చుకోవాలి



జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు పలుచోట్ల కనిపించడంతో నెల్లూరుతోపాటు సమీప ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా చికెన్ దుకాణాలను మూసివేయాలని ఆదేశించాం. మంగళవారం నుంచి చికెన్ విక్రయాలు చేసుకోవచ్చు. అయితే కొనుగోలుదారులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా విక్రయాలు చేసుకోవాలి. చికెన్ దుకాణాలు, పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని పాటించాలి.

– పెంచలయ్య, డీఎంహెచ్‌ఓ

చాటగొట్ల, గుమ్మళ్లదిబ్బల్లో కేంద్ర బృందం పర్యటన

పొదలకూరు: మండలంలోని చాటగొట్ల గ్రామంలో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లు మృతిచెందడంతో వ్యాధి నిర్ధారణ కోసం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం సోమవారం గ్రామానికి విచ్చేసింది. బృందంలో నేషనల్ సెంటర్ ఫర్ డిసీజెస్ కంట్రోల్ నుంచి డాక్టర్ సుస్మితా సింఘాల్, లేడీ హార్డింగ్ హాస్పిటల్ డాక్టర్ గురుమిత్‌కౌర్, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ శ్రేయ శర్మ ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ల బృందం గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించింది. గ్రామస్తుల నుంచి రక్తనమూనాలు సేకరించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటిస్తే సరిపోతుందని తెలిపారు. పక్షుల ద్వారా సంక్రమించే బర్డ్‌ఫ్లూ ప్రాణాంతకం కాదని అవగాహన కల్పించారు. వారి వెంట రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ మల్లేశ్వరి, జిల్లా సర్వైలెన్స్ వైద్యాధికారి భాస్కర్, పీహెచ్‌సీ వైద్యాధికారులు నరసింహారావు, కిరణ్ రిషిత, శ్రీకావ్య తదితరులు ఉన్నారు.

గుమ్మళ్లదిబ్బలో

కోవూరు: మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామంలో ఇటీవల కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకిన నేపథ్యంలో ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృంద సభ్యులు డాక్టర్ సుస్మితా సింఘాల్, డాక్టర్ గురుమిత్‌కౌర్, డాక్టర్ శ్రేయాశర్మ సోమవారం ఆ గ్రామంలో పర్యటించారు. ముందుగా ఈ గ్రామంలో కోళ్లకు వ్యాధి సోకిన వెంకటేశ్వర్లు ఇంటిని సందర్శించి కోళ్లు ఎక్కడి నుంచి తెచ్చారు.. ఎప్పుడు వైరస్ సోకింది.. ఎన్ని కోళ్లు మృతిచెందాయి.. ప్రయోగశాలకు ఎప్పుడు తీసుకెళ్లారు అనే విషయాలపై ఆరా తీశారు. బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై పశుసంవర్ధకశాఖ చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యాధి సోకిన కోడిని భోపాల్ ల్యాబ్‌కు తీసుకెళ్లిన సంబంధిత పశుసంవర్ధకశాఖ సిబ్బందికి కూడా వీటీఎం టెస్ట్ చేయించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వారి వెంట జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ నాగమణి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మురళి, ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, డాక్టర్ ప్రీతి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



పొదలకూరు: గ్రామస్తుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య బృందం



కోవూరు: గుమ్మలదిబ్బలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తిపై ఆరా తీస్తున్న కేంద్ర బృందం సభ్యులు

సంకల్ప బలం.. ప్రగతి పథం

ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పం.. తన నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్న ఆశయం.. వెరసి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి తోడు మరింత పురోగతికి పునాదులు పడ్డాయి.. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆ ప్రాంత ప్రజాప్రతినిధిగా తన పరపతితో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని.. తన తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సోదరుడు గౌతమ్‌రెడ్డి ఆశయాల సాధనే లక్ష్యం సరికొత్త చరిత్రకు నాంది పలికారు.

అభివృద్ధికి చిరునామాగా ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం
- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరాటంకంగా సేవలు
- ఏడీఎఫ్‌లో భాగస్వాములై పుట్టినగడ్డకు సేవ చేస్తున్న దాతలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఆత్మకూరు నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కొత్త పంథాలో ముందుకుసాగుతున్నారు. తన తండ్రిని, సోదరుడిని, తనను ప్రజాప్రతినిధులుగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని సంకల్పించారు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం రూ.వందల కోట్లతో ఆత్మకూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తోంది. మరో వైపు పుట్టిన గడ్డపై మమకారం ఉన్న ప్రతి ఒక్కరినీ ఒక తాటిపైకి తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామనే లక్ష్యంతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి 'ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం' అనే వేదికను ఏర్పాటు చేశారు.

ఏడీఎఫ్ ప్రస్థానం

తన సోదరుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఆకస్మిక మరణంతో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఆత్మకూరు నియోజకవర్గం నుంచి విక్రమ్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో పర్యటించి ప్రజల కష్టసుఖాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఓ వైపు పెండింగ్‌లో ఉన్న అనేక అభివృద్ధి పనులను ప్రభుత్వం ఒక్కొక్కటిగా చేపడుతూ, మరో వైపు సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు నిర్మిస్తూ, నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలను అభివృద్ధి చేస్తోంది. అందులో కొన్ని రకాల వసతులు కల్పించాలంటే ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రైవేట్ భాగస్వామ్యం తోడైతే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆలోచన చేశారు. పార్టీలకు అతీతంగా ఏడీఎఫ్(ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం)ను ప్రారంభించారు.

పుట్టిన ఊరిపై మమకారం

ఏడీఎఫ్‌ను ప్రారంభించిన నాటి నుంచి నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనుల్లో తొలి పనిగా దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి పేరున ఆత్మకూరులో మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం ప్రారంభించి పూర్తి చేశారు. అలాగే పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేస్తూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇలా ఏడీఎఫ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు అందరి దృష్టికి రావడంతో మరింత మంది అందులో భాగస్వాములు అయ్యేందుకు ముందుకొచ్చారు. అంతటితో ఆగక ఏడీఎఫ్ బెంగళూర్ చాప్టర్‌ను ఆవిష్కరించి అక్కడి వారిని భాగస్వాములను చేసి ఏడీఎఫ్‌ను మరింత విస్తృతం చేశారు. పుట్టిన ఊరిపై మమకారం ఉన్న పలువురు సంపన్నులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు ఏడీఎఫ్ ద్వారా తమ గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి నడిచేందుకు సిద్ధమయ్యారు. ఈ ఒక్క సంవత్సరంలోనే నియోజకవర్గంలో 100కు పైగా పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌రూంల ఏర్పాటుతోపాటు సంగంలో ఐటీఐ కళాశాల నిర్మాణానికి సైతం దాతల సహకారంతో అడుగులు వేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు మండల కేంద్రాల్లో బస్టాండ్‌లను నిర్మించేందుకు.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వసతులు సమకూర్చేందుకు.. ఇలా ప్రజలకు ఉపయోగపడే విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ఏడీఎఫ్ పనిచేసేలా విధానాలను రూపొందించి ముందుకు సాగుతున్నారు. ఏడీఎఫ్ ద్వారా చాబోలు, కృష్ణాపురం గ్రామాల విద్యార్థులకు బస్సు సైతం ఏర్పాటు చేశారు. ఆత్మకూరులో రెండు విడతల్లో నిర్వహించిన ఎంజీఆర్ జాబ్‌మేళాల్లో 691 మందికి పలు సంస్థల్లో ఉద్యోగాలు లభించాయి. ఏడీఎఫ్ గురించి తెలుసుకున్న సింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మేకపాటి కుటుంబంపై ఉన్న గౌరవంతో డిజిటల్ లైబ్రరీలతోపాటు మరికొన్ని అభివృద్ధి పనులకు ఆర్థిక సహకారం అందించారు.



అనంతసాగరం జెడ్పీ హైస్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూం ద్వారా విద్యార్థులకు బోధన (ఫైల్)

ఏడీఎఫ్ ద్వారా చేపట్టిన కొన్ని పనులు

మండలం	చేపట్టిన పని	విలువ	దాత
ఆత్మకూరు	ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం	రూ.4.50 కోట్లు	ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
అనంతసాగరం	సోమేశ్వరాలయ పునరుద్ధరణ	రూ.50 లక్షలు	ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి
మర్రిపాడు	చాబోలు విద్యార్థులకు బస్సు సౌకర్యం	రూ.10 లక్షలు	కృష్ణప్రసాద్‌రెడ్డి
అనంతసాగరం	పంచాయతీ బస్టాండ్ నిర్మాణం	రూ.15 లక్షలు	బుట్టి వెంకటకృష్ణారెడ్డి, కుటుంబసభ్యులు
ఆత్మకూరు	దివ్యాంగులకు పరికరాల పంపిణీ	రూ.21.10 లక్షలు	అలెంకో ద్వారా..

ప్రైవేట్ భాగస్వామ్యం శుభపరిణామం



ప్రభుత్వ అభివృద్ధికి తోడు ప్రైవేట్ భాగస్వామ్యంతో పనులు చేస్తే సేవలు మరింత వేగంగా ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావడం శుభపరిణామం. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆలోచనతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతోంది.

– రాపూరు వెంకటసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు, అనంతసాగరం

సేవలు కొనసాగుతున్నాయి



ఆత్మకూరు నియోజకవర్గంలో ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేస్తున్న కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించేందుకు డిజిటల్ క్లాస్ రూంలతోపాటు ఇప్పటికే పాఠశాలలకు ఇన్వర్టర్లు కూడా అందజేశారు. ఏడీఎఫ్ సేవలు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా.

– పెయ్యల సంపూర్ణమ్మ, ఎంపీపీ, అనంతసాగరం



కనుపూరుపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతులకు ఏడీఎఫ్ ద్వారా నిధులిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి (ఫైల్)

యాదవ చైతన్యవేదిక భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న బీద మస్తాన్‌రావుతో పలువురు బీసీ నేతలు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడ సమీపంలో జాతీయ రహదారి పక్కన నూతనంగా యాదవ చైతన్య వేదిక భవన నిర్మాణానికి సోమవారం రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు శంకుస్థాపన నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ స్థలం ఇచ్చిన దాత ఉదయగిరి జెడ్పీటీసీ మోది రామాంజనేయులును అభినందించారు. ఇలాంటి మారుమూల ప్రాంతంలో యాదవ సోదరులందరూ కలిసి ఇలాంటి చైతన్య వేదిక నిర్మాణం చేపట్టడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా మస్తాన్‌రావును పలువురు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్, శ్రీవారి తొలి దర్శన భాగ్యం కలిగిన వంశీయుడు కిషోర్‌యాదవ్, టీడీపీ నేత బీద రవిచంద్ర, బీజేపీ నేత భరత్‌యాదవ్, తెలంగాణ మాజీ ఎమ్మెల్యే నోముల భరత్, మాజీ జెడ్పీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, పలువురు యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్‌తో వాగ్వాదం

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్‌ఎల్‌బీ పరీక్ష కేంద్రంలో సోమవారం విద్యార్థులు ఇన్విజిలేటర్‌తో వాగ్వాదానికి దిగారు. పరీక్ష కేంద్రం వద్ద ఓ విద్యార్థిని తనిఖీ చేసే సందర్భంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంటనే వీఎస్‌యూ అధికారులు జోక్యం చేసుకుని వివాదాన్ని సర్దుబాటు చేశారు.

సీబీఎస్‌ఈ పరీక్షలు ప్రారంభం

నెల్లూరు(టౌన్): సీబీఎస్‌ఈ పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 1,246 మంది పదో తరగతి విద్యార్థులు, 1,461 మంది ఇంటర్ విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలోని పది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించేందుకు కేంద్రీయ విద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 సీబీఎస్‌ఈ పాఠశాలలు ఉన్నాయి. వచ్చే నెల 2వ తేదీ వరకు సీబీఎస్‌ఈ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకోకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీబీఎస్‌ఈ పరీక్షలను ఢిల్లీకి చెందిన కేంద్రీయ విద్యాలయం అధికారులు, చెన్నై అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ ఎన్నికల ఏజెన్సీలు నిర్దేశించిన నూతన ఎన్నికల నిబంధనలను ఆకళింపు చేసుకుని వారి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ మద్యం, మాదక ద్రవ్యాలు, డబ్బు, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల వ్యయం, ఫిర్యాదులు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని నోడల్ అధికారులకు సూచించారు. సీజ్ చేసిన వాటిని ఏఎస్ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేయాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించిన తేదీ నుంచి ఏజెన్సీలు చురుకుగా పనిచేయాలని, సంబంధిత శాఖల్లో ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. బ్యాంకుల్లో నగదు లావాదేవీలు, ఎన్నికల్లో ప్రలోభ పరిచే వస్తువుల రవాణా తదితర అంశాలపై దృష్టి పెట్టి నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. ఎన్నికల సంఘం రాష్ట్ర స్థాయిలో ఆయా శాఖల అధిపతులను రాష్ట్ర నోడల్ అధికారులుగా నియమించిందని, వారి నుంచి తగిన సమాచారం తీసుకుని ఆ ప్రకారం పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రాబోయే వారంలో మరో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేస్తామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ లవన్న, అడిషనల్ ఎస్పీ సౌజన్య, ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ శోభ, ఎక్సైజ్, జీఎస్టీ, రవాణా, ఫారెస్ట్, పోలీస్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

తల్లిదండ్రులను వేధిస్తే కఠిన చర్యలు

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): ఆస్తి కోసం తల్లిదండ్రులను చిత్రహింసలు పెట్టే పిల్లలపై చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 80 మంది విచ్చేసి తమ సమస్యలపై ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రధానంగా ఉద్యోగాలు, ప్రేమ, సైబర్ మోసాలు, కన్నబిడ్డలు హింసిస్తున్నారని, ఆస్తి కోసం చిత్రహింసలు పెడుతున్నారని, కుటుంబ కలహాలు, అదనపు కట్నం కోసం అత్తింటివారు వేధిస్తున్నారని తదితరాలపై ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలోని వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఆత్మకూరు, డీటీసీ డీఎస్పీలు ఎస్.కోటారెడ్డి, బి.శిరీష, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సహకార అభివృద్ధి సమన్వయ సమావేశం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా సహకార అభివృద్ధి సమన్వయ సమావేశం కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధ్యక్షతన సోమవారం క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించాలని ఆదేశించారు. ప్రతి సహకార సంఘంలోని కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా లావాదేవీలు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన మల్టీపర్పస్ గోదాములను వినియోగించేలా చూడాలన్నారు. జనఔషధి గురించి సంఘాల ద్వారా ప్రచారం చేయాలన్నారు.

భార్య కళ్లెదుటే భర్త హత్య

- మృతుడి శరీరంపై 25కి పైగా కత్తిపోట్లు
- మణికట్టు, మెడ నరాలు కోసిన వైనం
- పాతకక్షలే కారణమంటున్న కుటుంబసభ్యులు
- విభిన్న కోణాల్లో పోలీసుల దర్యాప్తు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిని అతని భార్య కళ్లెదుటే దుండగులు అతి పాశవికంగా హత్య చేసిన ఘటన నెల్లూరు నగరంలోని రామచంద్రాపురం రామాలయం వీధిలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పాతకక్షల నేపథ్యంలోనే దుండగులు హత్య చేశారని కుటుంబసభ్యులు చెబుతున్నారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. రామాలయం వీధికి చెందిన ఎం.నరసింహులు, కాంతమ్మ దంపతులకు ప్రసన్న, లక్ష్మి, ప్రభావతి అనే కుమార్తెలు, పెంచల ప్రసాద్ (35) అనే కుమారుడు సంతానం. పెంచల ప్రసాద్‌కు తన పెద్ద అక్క ప్రసన్న కుమార్తె సుహితతో ఆరు సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి పెంచల గౌతమ్, పెంచల విహాంత్ అనే పిల్లలున్నారు. ప్రసన్న తన భర్తతో కలిసి తమ్ముడు వద్దనే ఉంటున్నారు. ప్రసాద్ ట్రక్కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పదిరోజుల క్రితం ప్రసన్న దంపతులు తమ చిన్న మనుమడు విహాంత్‌ను తీసుకుని కలువాయి మండలం తోపుగుంట గ్రామంలో సత్తమ్మ తల్లికి పొంగళ్లు పెట్టుకునేందుకు వెళ్లారు. మూడురోజుల క్రితం లక్ష్మి దంపతులు ప్రసాద్ పెద్ద కుమారుడు గౌతమ్‌ను తీసుకుని తోపుగుంటకు వెళ్లారు. ఆదివారం ఉదయం ప్రసాద్ కూడా అక్కడికి వెళ్లాడు. ఆయన భార్య, తండ్రి నరసింహులు ఇంటి వద్దనే ఉన్నారు. పొంగళ్లు పెట్టుకుని అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు పెంచల ప్రసాద్ నెల్లూరుకు వచ్చాడు. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో పని నిమిత్తం బయటకు వెళ్లి రాత్రి 9 గంటలకు తిరిగొచ్చాడు. కాగా నరసింహులు సరస్వతి నగర్‌లో ఉంటున్న చిన్న కుమార్తె ఇంటికి వెళ్లి రాత్రి అక్కడే ఉన్నాడు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్లు, (ఇన్‌సెట్లో) పెంచల ప్రసాద్ (ఫైల్)

కనికరం లేకుండా..

ప్రసాద్, సుహిత ఇంట్లో నిద్రపోతుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు గోడదూకి ఇంట్లోకి ప్రవేశించారు. తలుపులు తట్టగా ప్రసాద్ తీశారు. వెంటనే నిందితులు అతడిపై విచక్షణారహితంగా కత్తులతో దాడి చేశారు. భర్త అరుపులతో నిద్ర నుంచి మేల్కొన్న సుహిత కేకలు వేస్తుండగా దుండగుల్లో ఒకరు ఆమె అరవకుండా దిండుతో నోటిని నొక్కిపెట్టారు. తీవ్ర రక్తస్రావంతో పెంచల ప్రసాద్ బెడ్‌పై పడిపోయాడు. అయినా కనికరించని నిందితులు అతడి మెడ నరాలు, చేతుల మణికట్లు, కాళ్ల మడిమలను కిరాతకంగా కోసి చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం పరారయ్యారు. సుహిత వెంటనే నరసింహులుకు ఫోన్ చేసి చెప్పింది. స్థానికులు నవాబుపేట పోలీసులకు సమాచారం అందించారు.

గతంలో గొడవలు

పొంగళ్లను పూర్తి చేసుకుని లక్ష్మి కుటుంబం అర్ధరాత్రి ఇంటికి చేరుకున్నారు. ఆ సమయానికి ఆ ప్రాంతానికే చెందిన వర, సాగర్, సాయి, మనో అనే వ్యక్తులు పెంచల ప్రసాద్ ఇంటి నుంచి పరుగెత్తుకుంటూ వెళుతుండటాన్ని లక్ష్మి గమనించింది. దీంతో ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లోకి వెళ్లిచూడగా తమ్ముడు హత్యకు గురై ఉండటంతో కన్నీటిపర్యంతమైంది. గతంలో వినాయకచవితి సందర్భంగా మృతుడికి, పరారైన వ్యక్తులకు గొడవలు జరిగాయి. సంక్రాంతి సందర్భంగా ఇంటి ముందు వేసిన ముగ్గులను మోటార్‌బైక్‌లతో వారు చెరిపేస్తుండటంతో ప్రసాద్‌తోపాటు సమీపంలోని పలువురు మహిళలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కక్ష పెంచుకున్న వారే ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారని పెంచల ప్రసాద్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు నరసింహులు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిందితుల కోసం గాలింపు

సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలాన్ని నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి, నవాబుపేట, రాత్రి గస్తీ విధుల్లో ఉన్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్లు ఎం.బాబీ, బి.అశోక్‌కుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేశారు. ప్రసాద్ శరీరంపై 25కు పైగా కత్తిపోట్లు ఉన్నట్లు వారు గుర్తించారు. సాంకేతికత ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. ఘటన జరిగిన సమీప ప్రాంతాల్లోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించగా దుండగులు రెండు ఆటోలు, బైక్‌ల్లో వెళ్లినట్లు గుర్తించారు. సోమవారం ఉదయం ఘటనా స్థలంలో క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

• పొగాకు రైతులకు చైర్మన్ యశ్వంత్ సూచన


గ్రేడింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ యశ్వంత్

కందుకూరు: పొగాకు రైతులు దళారులను నమ్మి మోసపోకుండా వేలం కేంద్రాల్లోనే అమ్ముకోవాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ సూచించారు. కందుకూరులోని ఒకటి, రెండు వేలం కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం పొన్నలూరు, దూబగుంట, శాఖవరం, వీఆర్ కోట గ్రామాల్లో క్యూరింగ్, గ్రేడింగ్ విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లిన కర్రలను బ్యారన్‌లో మోతాకు మించి పెట్టవద్దని, క్యూరో మీటర్ తప్పనిసరిగా వాడాలన్నారు. దీని వల్ల అగ్ని ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలను వేరు చేయాలన్నారు. రైతులు వేలం కేంద్రం బయట అమ్ముకోవడం చట్ట ప్రకారం నేరమన్నారు. అలాగే రైతుల వద్ద దళారులు పొగాకు కొనుగోలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బోర్డు నిబంధనల ప్రకారం కచ్చితంగా వేలం కేంద్రాల్లోనే అమ్ముకోవాలని దీని వల్ల రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందన్నారు. ఈ ఏడాది పొగాకు రేట్లు కూడా ఆశాజనకంగా ఉన్నందున తొందరపడి బయట వ్యాపారులకు విక్రయించవద్దని సూచించారు. బయట జరిగే క్రయ, విక్రయాలపై బోర్డు విజిలెన్స్ అధికారుల నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఆయన వేలం కేంద్రాల నిర్వహణాధికారులు చైన్ రామ్‌మీనా, రాజగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

మానవహక్కుల కమిషన్ సభ్యురాలిని కలిసిన ఎస్పీ



నెల్లూరు(క్రైమ్): జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయి సోమవారం నెల్లూరుకు వచ్చారు. మినర్వా గ్రాండ్‌లో బస చేశారు. ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

అప్పు తీర్చాలని అడిగినందుకు..

• వృద్ధుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని సాల్మన్‌పురంలో ఈనెల 15వ తేదీన జరిగిన నారాయణరెడ్డి అనే వృద్ధుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. సోమవారం బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నారాయణరెడ్డి బుచ్చి పట్టణంలో కూల్‌డ్రింక్ షాపు నిర్వహిస్తున్న పింటూ అనే వ్యక్తికి గతంలో రూ.45,000 అప్పుగా ఇచ్చాడు. అతను బాకీ తీర్చలేదు. దీంతో ఇద్దరి మధ్య పలుమార్లు గొడవ జరిగింది. అప్పు విషయమై తనను ఇబ్బంది పెడుతున్న నారాయణరెడ్డిని ఎలాగైనా అంతమొందించాలని పింటూ నిర్ణయించున్నాడు. ఈనెల 15న సాయంత్రం సాల్మన్‌పురంలో నారాయణరెడ్డి ఇంట్లో ఒంటరిగా ఉండగా అతను వెళ్లి చాకుతో గొంతులో పొడిచి హత్య చేసి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పట్టణంలోని జొన్నవాడ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసును ఛేదించిన బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు, ఎస్సై మహేంద్రను డీఎస్పీ అభినందించారు.

అనారోగ్యం తాళలేక వృద్ధురాలి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అనారోగ్యం తాళలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నెల్లూరు ఎన్‌సీసీ కాలనీలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. డైకస్ రోడ్డు ఎన్‌సీసీ కాలనీ మూడో వీధిలో విశ్రాంత పంచాయతీ కార్యదర్శి వి.సుందర్‌రాజు, అమరావతి (58) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి అనిల్, అనూష సంతానం. ఏడాదిగా అమరావతి షుగర్, బీపీ, కీళ్లనొప్పులతో బాధపడుతోంది. వివిధ హాస్పిటళ్లలో చూపించినా ఆరోగ్యం కుదుటపడలేదు. కీళ్లనొప్పులు భరించడం కంటే చావడం మంచిదని ఆమె పలుమార్లు కుటుంబసభ్యులతో చెప్పింది. సోమవారం అనూషను గూడూరు బస్సు ఎక్కించేందుకు అనిల్ బయటకు వెళ్లగా, సుందర్‌రాజు వాకింగ్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో అమరావతి తన ఇంట్లోని పైపోర్షన్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటికి తండ్రి, కుమారుడు ఇంటికి వచ్చి చూశారు. ఆమె కనిపించకపోవడంతో పైకి వెళ్లగా తలుపులు తెరుచుకోలేదు. కిటికీలో నుంచి చూడగా అమరావతి ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో మారు తాళంతో తలుపులు తెరిచి ఆమెను కిందకు దించి నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో అనిల్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు



(కిలో)

పెద్దవి	రూ.80
సన్నవి	రూ.70
పండ్లు	రూ.25

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	146
లేయర్ (లైవ్)	80
బ్రాయిలర్ చికెన్	256
బ్రాయిలర్ స్కిన్‌లెస్	284
లేయర్ చికెన్	136

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీకి నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు జిల్లా యంత్రాంగం నుంచి ఉన్నతాధికారులు బి.చిరంజీవి, శ్రీనివాసులు, ఎం.పెంచలయ్య కూడా సభ్యులుగా వ్యవహరిస్తారు. అనధికార విభాగానికి సంబంధించి బత్తల ప్రవల్లిక, దుంపా యశోధ, మెట్టల చెంచుకృష్ణయ్య, గంధళ్ల శ్రీరాములు, ఇంకా ఎన్జీఓ విభాగానికి సంబంధించి విశ్రాంత తహసీల్దార్ షేక్ బషీర్, ఇస్కాల సాయిప్రసాద్, ఉల్లిపాయల మురళీకృష్ణ యాదవ్‌ను నియమించారు. రెండు సంవత్సరాలపాటు ఈ కమిటీ కొనసాగుతుంది. ప్రతి మూడు నెలలకోసారి సమీక్షలు నిర్వహిస్తుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ మీ అబ్బాయిలేక అమ్మాయి బీటెక్/డిగ్రీ ఫెయిల్ అయ్యారని లేదా మధ్యలో చదువు ఆగిపోయింది అనిఆలోచిస్తున్నారా మీరు కోరుకున్న విధంగా వారు కోర్సుని కంప్లీట్ చేసుకొనే అవకాశం.9030030125. [T-3080]

DIRECT FINAL YEAR

■ Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629 [T-4921]

REAL ESTATE

FLAT FOR SALE

■ నెల్లూరు సిటీ ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో అపార్టుమెంట్ 3వ ఫ్లోర్‌లో 1560Sft గల 3BHK FLAT కేవలం 45 లక్షలకే అమ్మకానికి కలదు. కొనదలచినవారు వివరాలకు సంప్రదించండి: 93812 43199, 94415 82575. [NA-23165]

LAND FOR SALE

■ ధనలక్ష్మీపురం కాకుపల్లి సెంటర్ నుండి 2 km దూరంలో 25 సెంట్లు భూమి అమ్మబడును. (With Farm House) వివరాలకు సంప్రదించండి. : 70362 31356. [NA-23153]

PLOT FOR SALE

■ అంకణముర్రా.15వేలు,ప్లాట్:2లక్షల 48వేలు. ఇళ్ళ మధ్యన DTCP లేఔట్, ముత్తుకూరు రోడ్, పిడతాపోలూరు Genco రోడ్కి, కొద్ది ప్లాట్లు మాత్రమే కలవు. సెల్ : 98491 67798. [N-1249451]

■ నెల్లూరు నుండి 10km దూరంలో మైపాడు రోడ్డు (నెల్లూరు కోనసీమ) 50 అం।। స్థలం, గార్డెన్, ఫాంహౌస్‌తో పాటు అమ్మబడును. వివరాలకు సంప్రదించండి: 83093 04379. [NA-23154]

WANTED

■ Wanted-CA Final/CA Inter / Accountant with 2 Yrs Experience to work at Audit Office. Contact 86888 78884. [NA-23163]

■ Wanted Female Computer Operators. Qlf: B.Tech/MCA, Sal:15K, Timings : 8:30AM to 5PM, Year of Passed out : 2020/2021/ 2022/2023. Sent Resume to : 7995402877. [NA-6262]

■ Wanted Job Vacancies Stores & Office Executive. 2-3 Years Experience Good Communication Skills Male & Female (Married) Contact: 70134 69542. [N-1249458]

■ Wanted Telecallers and Academic Counsellors for Sandip University. Nellore Office. Qlf: Any Degree. Salary: 15k to 20k + high incentives. further details Contact 99598 99798. [NA-23149]

■ HERO స్పేర్స్ డిస్ట్రిబ్యూటర్ కంపెనీలో పనిచేయుటకు డ్రైవర్లు కావలెను. సంప్ర: ఐనమడుగు సెంటర్, నెల్లూరు. ✆ 91000 66735. [O-192173]

■ ప్రముఖ ఇంజనీరింగ్ యూనివర్సిటీలో వర్క్ చేయుటకు అనుభవజ్ఞులైన లేడి టెలికాలర్స్ కావలెను. జీతం: 10k+Inc. Qlf: ఏదైనా డిగ్రీ. 91005 82474, 63015 11415, నెల్లూరు. [N- 1189989]

PASSPORT LOST

I, PUCHALAPALLI SUBRAHMANYAM S/o: PUCHALAPALLI VENKAIAH, residing at 3-1-205, 1st Floor, Putta Street, Nagendra Nagar, Nawabpeta, Nellore, SPSR Nellore Dt, AP. I have lost my passport bearing No: G1396831 while I was traveling by bike to Santhapeta, Nellore. If anyone found please inform at the above address.

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9177736926 [G-8528]

■ ఫ్యాకల్టీస్ కావలెను. MS-ఆఫీస్, వెబ్ & మొబైల్ టెక్నాలజీ,కంప్యూటర్ హార్డ్‌వేర్,క్లౌడ్ కంప్యూటింగ్, టాలీ,జావా, టైలరింగ్, బ్యూటీషియన్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్. 90001 73808. [N-1249457]

■ లేడీ టెలికాలర్స్, రిసెప్షనిస్ట్ కావలెను. ఆఫీసు ఇంటర్వ్యూలో మాత్రమే వివరాలు తెలియజేస్తారు వాళ్ళు మాత్రమే కాల్ చేయండి. VRC, నెల్లూరు. సెల్ : 77999 66700. [N- 1249428]

■ మా సెక్యూరిటీ సంస్థ నెల్లూరు టౌన్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. 12గంటల డ్యూటీ. జీతం: 12,000/- సెల్: 89850 11766, 93928 41678. [N- 1263991]

■ ప్రముఖ కంపెనీలలో పని చేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం + ఇన్సెంటివ్స్. విద్యా అర్హత : ఇంటర్, డిగ్రీ. వివరములకు సంప్రదించండి: 63042 28875, 72075 11653. [N- 1238115]

■ నెల్లూరు బోసుబొమ్మ దగ్గర గల IOC పెట్రోలు బంకులో డే డ్యూటీకి పని చేయుటకు యువతి/ యువకులు & నైట్‌డ్యూటీకి యువకులు కావలెను. సంప్ర: 99082 99973, 95501 89885. [NA-6261]

■ నెల్లూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (M/F) Any Qualification. వివరాలకు సంప్రదించండి. సెల్ : 63019 11854. [NA-10486]

■ నలంద CBSEస్కూలు,గాయత్రినగర్, కావలి నందు పనిచేయుటకు 10th క్లాస్‌కి మ్యాథమాటిక్స్ ట్యూటర్ కావలెను. మంచి జీతం, ఉచిత భోజన వసతి. సెల్: 99498 49758. [N-1249264]

■ నెల్లూరులోని ప్రముఖ విద్యా సంస్థలో జాబ్ చేయుటకు కంప్యూటర్ అసిస్టెంట్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. వివరములకు సంప్రదించండి: 91008 02100. [NA-477]

■ చిల్డ్రన్స్ గేమ్స్ జోన్ (ఆర్ట్ గ్లోబ్)లో పని చేయుటకు టెన్త్ పాస్ అయిన వారు కావాలి. అర్హతను బట్టి జీతం : రూ.8-20వేల వరకు. మహిళలకు ప్రాధాన్యం. సెల్: 70324 74231. [NA-2607]

■ సెక్యూరిటీగార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, ASO, SOలు కావలెను. 12 గం।।లు డ్యూటీ, 45 సం।। లోపు వయస్సు ఉండాలి. మగవారు మాత్రమే. సెల్ : 72880 04466, 72880 04477. [NA-11651]

■ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఆడవారు మాత్రమే. MS-Office అనుభవం ఉండాలి. English Writing / Reading బాగా వచ్చి ఉండాలి.జీతం:15000/-.సెల్:7288004466. [NA-11652]

■ తెలుగులో మాట్లాడుటకు టెలికాలర్స్ కావలెను. 10am to 6pm. వయసు 40 లోపు ఆడవారు మాత్రమే. అర్హత :SSC పాస్. జీతం:15000/- సెల్ : 72880 04466, 72880 04477. [NA-11653]

LOSS OF PASSPORT

I, DONDLA RAVANAMMA, W/o. DONDLA REDDEPPA (Late) Residing of H.No. 3-6-144, Weevars Colony, Lakshmipuram, Nellore-524002, SPSR Nellore Dt, AP. I have lost my Original Passport bearing No. A7378272, While I was traveling from my house to Nawabpet Center, Nellore for the Purpose of Xerox on 18-01-2024. If Anyone found Please inform at the above address.

■ Wanted Teachers: 6-10 తరగతి వరకు ఇంగ్లీషు, సోషల్ బోధించుటకు టీచర్స్, ట్యూటర్స్ కావలెను. ప్రియాంక EM స్కూలు, ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు. సెల్ : 94402 66743. [NA-2605]

■ ఫెయిత్ డా।। రమణి, BPT, MIAP, 10th చదివిన అమ్మాయిలు, ఫిజియో అసిస్టెంట్లుగా, ఆయా కావలెను. మధురా స్వీట్స్ ఎదురు వీధి, బృందావనం2వ వీధి,నెల్లూరు.92464 65433. [NA-23150]

■ వాటర్ క్యాన్లు డెలివరీ చేయుటకు ఆటో డ్రైవింగ్ తెలిసిన డెలివరీ బాయ్స్ కావలెను.12గం।।ల డ్యూటీ జీతం: 15000-18000.ఉచిత వసతి కలదు. ఉత్సాహవంతులైన యువకులు సంప్ర: 96186 10203. [NA-23124]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజీలు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు.95027 12418, 90306 12463 [M-1233787]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167528]

■ మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 97015 05819 [V-797183]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్: 9391753308. [HA-1240]

■ మెడ్‌ప్లస్ ఫార్మసీ నెల్లూరు జిల్లాలోని నెల్లూరు, గూడూరు, నాయుడుపేట, కోవూరు మెడికల్ షాప్‌లో పని చేయుటకు ఫార్మసిస్ట్ (PCI కలిగినా) D/B/M ఫార్మసీ మరియు మెడికల్ షాప్‌లో అనుభవం కలవారు కావలెను. PH: 6281024633, 8498062405. [HA-792]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.